క్లుప్తంగా

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

భోగాపురం: ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఎం.సురేష్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్ద్రార్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై సమగ్ర విచారణ చేసి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ సుభాష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్, సీనియర్ అసిస్టెంట్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిగా విజయగౌరి

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా కోడెల్ల విజయగౌరిని యూటీఎఫ్ బలపరుస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార పోస్టర్‌ని విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిశోర్‌కుమార్, రెడ్డి మోహనరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సబ్‌ఎడిటర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలకు స్పందన

విజయనగరం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'గ్రంథాలయల ఆవశ్యకత' అనే అంశంపై శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి పోటీలను పర్యవేక్షించారు.

అవంతి కళాశాలలో పుస్తక ప్రదర్శన


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

భోగాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో లైబ్రేరియన్ తిప్పాను జగన్నాథం ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ.. పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయంలో వివిధ కేటగిరీలకు చెందిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పుస్తక ప్రదర్శనకు సహకరించిన విశాఖపట్నం పారామౌంట్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఫార్మసీ లైబ్రేరియన్ రమణ, ఎస్‌ఏ శ్రీనివాసరావు, గోక చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధన దృక్పథాన్ని మెరుగుపరుచుకోవాలి

విజయనగరం అర్బన్: కళాశాల స్థాయి నుంచే పరిశోధనా దృక్పథాన్ని మెరుగుపరుచుకోవాలని ఎంవీజీఆర్ కళాశాల ప్రొఫెసర్ పి.సూర్యప్రసాద్ అన్నారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'వినూత్న పరిశోధన ఆలోచనలు' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ప్రదర్శనలో ఉంచిన దాదాపు 20 కొత్త ఆవిష్కరణలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కొత్త రంగాల్లో కొత్త ఆలోచనలను పెంపొందించుకోవడంపై చర్చించారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల డెరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీఏ నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఫ్రైడే డ్రైడేగా పాటించాలి

విజయనగరం: నగర ప్రజలంతా ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. నగరంలోని అన్నా క్యాంటీన్లు, పూర్తిచేసిన అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి, అక్కడ అందిస్తున్న ఆహార పదార్థాలను పరీక్షించారు. అన్నార్తుల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్‌లో ఆరోగ్యకరమైన ఆహారం అందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఈ మధ్య చేపట్టిన కాలువలు, సీసీ డ్రైన్లు, సంపులు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే ప్రధాన రహదారిలో నిర్వహిస్తున్న టీ, టిఫిన్ దుకాణదారులు చెత్తలను రహదారులపై పారబోయడం గమనించి సదరు వ్యాపారులను మందలించారు. రహదారులను అపరిశుభ్ర పరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోను సహించబోమన్నారు.


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే..

పేదల సొంతింటి కల సాకారం

- ఇంటి స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు
- నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం
- సకాలంలో బిల్లుల చెల్లింపుతో 50 శాతానికిపైగా నిర్మాణాలు పూర్తి
- కూటమి ప్రభుత్వం రాకతో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు


పిట్టపేట జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు

విజయనగరం మండలంలో 16 లేఅవుట్లలో 1080 ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. దుప్పాడలో 44, గొల్లలపేటలో (3 లేఅవుట్లు) 184, గుంకలాంలో (మండలానికి సంబంధించి) 52, జమ్ములో 06, జొన్నవలసలో 134, కొండకరకాంలో 120, కోరుకొండలో 120, కోరుకొండపాలెంలో 54, మలిచెర్లలో 77, నారాయణపురంలో 183, పినవేమలిలో 05, రాకోడులో 04, సారికలో 97 మందికి ఇళ్ల స్థలాలు మంజరు చేశారు.


విజయనగరం రూరల్: గుంకలాం లేఅవుట్లో పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు

☛ నాపేరు జొన్నాడ. సత్యవతి నాకు గుంకలాం లేఅవుట్‌లో ఇంటి స్థలం మంజూరుచేశారు. గడిచిన కొన్నేళ్లుగా విజయనగరం శివారు ప్రాంతంలో కుటుంబంతో ఉంటున్నాను. సొంతిల్లు లేక నానా ఇబ్బందులు పడేదాన్ని. జగన్‌మోహన్‌రెడ్డి చలవతో ఇంటి స్థలం మంజూరయ్యింది. పునాదులు నిర్మాణం చేస్తున్నాను.

☛ నాపేరు శంకర్. నేను నగరంలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉండేవాడ్ని. జగనన్న దయ వల్ల గుంకలాం లేఅవుట్‌లో ఇంటి స్థలం మంజూరు చేయడంతో సొంతిల్లు నిర్మాణం చేసుకుని కుటుంబంతో నివాసం ఉంటున్నాను. ఇలా ఒకరు ఇద్దరు కాదు. వేలాది మంది నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

మండలం	మంజూరైన గృహాలు	వివిధ దశల్లో ఉన్నవి	పూర్తయిన నిర్మాణాలు
భోగాపురం	1586	728	391
డెంకాడ	1951	650	401
పూసపాటిరేగ	1366	382	248
నెల్లిమర్ల	383	119	194
నగరపంచాయితీ	208	84	113


నెల్లిమర్ల జగనన్న కాలనీ నిర్మాణాలు పూర్తియిన గృహాలు


విజయనగరం రూరల్: జొన్నవలసలో జగనన్న లేఅవుట్‌లో పూర్తయిన నిర్మాణాలు

పూసపాటిరేగ: ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనేది కల. ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకం కింద అర్హులైన ప్రతి పేదవాడికి పార్టీలకు అతీతంగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. బిల్లులు వెంటవెంటనే చెల్లించడంతో గత ఐదేళ్లలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగాయి. ఇంటి స్థలం మంజూరు నుంచి బిల్లుల చెల్లింపు వరకు పారదర్శకతకు పెద్దపీట వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బిల్లులు చెల్లించకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు నెమ్మదించాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో పేదల గృహాలకు అప్పట్లో రూ.150 కోట్లు వరకు ప్రభుత్వం వెచ్చించింది. నెల్లిమర్ల నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 5494 గృహాలు మంజూరు చేసింది. 2024 మే నెల నాటికి 1347 గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. మిగతావి వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి.

గుంకలాంలో అతిపెద్ద లేఅవుట్..

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గంలో అతిపెద్ద లేఅవుట్ గుంకలాంలో ఏర్పాటుచేశారు. ఈ లేఅవుట్‌లో సుమారు 13 వేల మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయడమే కాకుండా స్వయంగా జగన్‌మోహన్‌రెడ్డే లేఅవుట్‌ను ప్రారంభించి పేదప్రజలందరికి దేవుడయ్యారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో ఇప్పటికే 80 శాతంకు పైగా నిర్మాణాలు పూర్తియ్యాయి. లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసి కుటుంబాలతో ఎంతో సంతోషంగా ఉన్నారు.

జగనన్న సొంతింటి కల నెరవేర్చారు

ఎంతో కాలంగా ఇల్లు లేక ఇబ్బంది పడ్డాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి బిల్లులు సకాలంలో చెల్లించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేదలందరికీ న్యాయం జరిగింది.
– తల్లిరి రోజ, పిట్టపేట, పూసపాటిరేగ

జగనన్న

గత ప్రభుత్వంలో విజయనగరం మండలంలో ఏర్పాటు చేసిన 16 లేఅవుట్లలో 1080 ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అలాగే అర్బన్ పరిధిలో ఏర్పాటుచేసిన గుంకలాం లేఅవుట్లలో 13వేలకు పైగా ఇళ్ల స్థలాలను మంజూరు చేయడం జరిగింది. వాటిల్లో అధికశాతం నిర్మాణాలు పూర్తిచేసుకుని లబ్ధిదారులు గృహ ప్రవేశాలు కూడా పూర్తిచేసుకున్నారు.
– ఈశ్వర్ విజయ్‌కాంత్, హౌసింగ్ ఏఈ

పీఎంఏవై ఇళ్ల పరిశీలన


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని ఎన్టీఆర్ నగర్‌లో పీఎంఏవై కింద మంజూరైన 576 ఇళ్ల నిర్మాణాలను కమిషనర్ కె.అప్పలరాజు శుక్రవారం పరిశీలించారు. ఇంతవరకు చేపట్టిన పనుల పురోగతిని టిడ్కో ఇంజినీర్ ఎస్.వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. అలాగే 0.3 ఎం.ఎల్.డి సామర్థ్యంతో నిర్మించిన సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను, 200 కె.ఎల్ సామర్థ్యంతో నిర్మాణ చేస్తున్న జీఎల్ఎస్ఆర్ పనుల పురోగతిపై ఆరా తీశారు. దీంతో పాటు ఎక్స్‌టర్నల్ ఎలక్ట్రిఫికేషన్‌కు సంబంధించి సబ్ స్టేషన్ నుంచి బ్లాక్‌ల వారీగా ఇళ్లకు విద్యుత్ సరఫరా కోసం ప్రస్తుతం ఎలక్ట్రికల్ పోల్స్ ఫిట్టింగ్ పనులను పరిశీలించారు. మిగిలిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం నగర పంచాయతీ పరిధిలో ఉన్న సారిపల్లిలో 2656 మంది లబ్ధిదారులకు ఏపీ టిడ్కో ద్వారా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తక్షణమే నిలిపివేయాలి


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్ఓ) నాయకులు వైవీఎస్ మహదేవన్, ఎ.సురేష్ డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర కరువు, వలసలు, విద్య, ఉపాధి రంగాలు– కర్తవ్యాలు అనే అంశంపై స్థానిక ఎంఆర్ లేడీస్ క్లబ్‌లో పీడీఎస్ఓ జిల్లా నాయకులు కె.సోమేష్, బి.రాకేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభానికి ముందు రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఎంఆర్ లేడీస్ క్లబ్ వరకు విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన సదస్సులో మహదేవన్ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎగ్గొట్టిన చందంగానే ఉత్తరాంధ్రకు కూడా కేంద్ర ప్రభుత్వం అన్యాయమే చేసిందన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా విభజన చట్టంలోని ఒక్కటంటే ఒక్క అంశం కూడా సంపూర్ణంగా నేటికీ అమలు కాలేదన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని విద్యాసంస్థలన్నింటికీ నిధులు కేటాయించి, పూర్తి చేయాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించి, ప్రైవేటీకరణను తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా కంప్యూటరీకరణ పూర్తికావాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్, జేసీ సేతుమాధవన్


విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియ జరుగుతున్న తీరుపై జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌తో కలిసి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో డీసీసీబీ అధికారులు, సహకార సంఘాల సిబ్బందితో సమీక్షించారు. సంఘాల్లోని సభ్యుల పేర్లను కంప్యూటరీకరణ చేసే కార్యక్రమం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పలు సంఘాల్లో రుణ బకాయిలు పెద్ద మొత్తంలో వసూలు కాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా రుణాల వసూలు చర్యలు చేపట్టనట్లయితే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సమావేశంలో డీసీఓ రమేష్, డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈఓ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

విజయనగరం: నగరం పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు, వినియోగంపై దాడులు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆయా దుకాణ యజమానులపై అపరాధ రుసుం విధిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందన్నారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ నల్లనయ్య కోరారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణే ధ్యేయం

- ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య


మహాసభల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ప్రభుత్వ విద్య పరిరక్షణే ధ్యేయంగా చేపడుతున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక అమర్ భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఉద్భవించిందన్నారు. ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయనగరం జిల్లాలో ఈనెల 27,28,29,30 తేదీల్లో జరుగుతున్నాయి. ఈ మహాసభలకు జాతీయ, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్‌ను బట్టి ప్రభుత్వం విద్యారంగం పట్ల ఎంత శ్రద్ధ చూపుతోందో అర్థమవుతోందని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం కూడా క్రమక్రమంగా విద్యారంగానికి బడ్జెట్ తగ్గిస్తూ ఉన్నది. విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాసర్ జీ, సహాయ కార్యదర్శి జి.ఫణీంద్ర, జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం, ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి గౌరీశంకర్, దుర్గాప్రసాద్, భాను, జ్యోతిలావణ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీల సదస్సు రేపు

డెంకాడ: విద్యాశాఖలో సీఆర్‌పీల పాత్రపై ఉత్తరాంధ్ర స్థాయిలో ఈనెల 17న తగరపువలస వద్ద ఉన్న ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు సీఆర్‌పీ ఫెడరేషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమౌతుందన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన సీఆర్‌పీలంతా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు కారణంగా మండలంలోని రాజుపులోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మోదవలస, గొండయ్యపాలెం, జరజాపుకల్లాలు, బంగారాజుపేట, కొండరాజుపేట, చినవల్లూరు, పెదవల్లూరు, మోపాడ గ్రామాలతో పాటు భోగాపురం మండలంలోని పోలిపల్లి, మహరాజుపేట, రాజపులోవ, చెరుకుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.


ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను ఉపేక్షించేది లేదు

విజయనగరం: నగరంలోని ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను ఉపేక్షించబోమని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగర పరిధిలో అనేక చోట్ల ఫుట్‌పాత్(నడకదారుల)లపై చిరువ్యాపారులు బడ్డీలు, తోపుడుబళ్లు పెట్టి వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. వాటిని తక్షణమే తొలగించాలని ప్రణాళిక సిబ్బందికి ఆదేశించామన్నారు. దీంతో పలు ప్రాంతాలలో ఫుట్‌పాత్‌లపై చేపడుతున్న చిరు వ్యాపారులను అక్కడి నుంచి పంపించి వేశారు. అలాగే తాత్కాలిక ఏర్పాట్లను కూడా తొలగించి వేశారు. నగర అందాలకు, ప్రజా జీవనానికి విఘాతం కలిగించే ఎట్టి చర్యలను సహించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రధాన జంక్షన్లు, ప్రధాన రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేసినట్లయితే ప్రజలకు, ట్రాఫిక్‌నకు పలు ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం గ్రామంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. భగవద్గీతతో పాటు అనుబంధ గ్రంథాల్లోని పలు అంశాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదివి అందులోని విషయాలను అర్థం చేసుకోవాలని సూచించారు.

ఏఎన్‌ఎంలకు ఇతర పనులు అప్పగించొద్దు


మాట్లాడుతున్న కొమ్మూరు దుర్గారావు

భోగాపురం: సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు ఇతర విధుల నుంచి విముక్తి కలిగించాలని భోగాపురం ఏపీఎన్జీఓ తాలూకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఏఎన్‌ఎంలకు ఆరోగ్య పథకాలకు సంబంధించిన విధులు తప్ప మరే ఇతర విధులు అప్పగించకూడదని ప్రభుత్వం ఆదేశిస్తూ జీఓ 24ను సెప్టెంబరు 30న విడుదల చేసిందన్నారు. జిల్లాలో మాత్రం ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడం లేదన్నారు. ఒక పక్క ఎన్‌సీడీ క్యాన్సర్ సర్వే, ఇమ్యూనైజేషన్ ఆర్‌బీఎస్‌కే డెలివరీ కేసులు, గర్భిణుల తనిఖీలు వంటి కీలకమైన ఆరోగ్య కార్యక్రమాలతో ఏఎన్‌ఎంలు సతమతమవుతుండగా.. పెన్షన్ల పంపిణీ, మరుగుదొడ్ల పరిశీలన, శానిటేషన్, హోమ్ సర్వే, పైప్‌లైన్ సర్వే వంటి కార్యక్రమాలను ఏఎన్‌ఎంలకు అప్పగిస్తున్నారన్నారు. పంచాయతీ కార్యక్రమాలు చేయకపోతే జీతాలు డ్రా చేయమని ఎంపీడీఓలు బెదిరిస్తున్నారని.. ఆరోగ్య కార్యక్రమాలు చేయకపోతే వైద్యాధికారులు ఒప్పుకోవడం లేదని, దీంతో సచివాలయం ఏఎన్‌ఎంలు నరకం చూస్తున్నారని దుర్గారావు వాపోయారు. దీనిపై ఏపీఎన్జీఓ నాయకత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

శివోహం..!

- కిటకిటలాడిన శివాలయాలు
- కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు

పవిత్ర కార్తీకమాసంలోని పౌర్ణమి తిథి సందర్భంగా జిల్లాకేంద్రం విజయనగరంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లోని శివలింగాలకు అర్చకులు పాలతో అభిషేకాలు చేయగా భక్తులంతా ఓం నమః శివాయ అంటూ శివ పంచాక్షరి నామాన్ని జపిస్తూ పూజల్లో పాల్గొన్నారు. కొందరు మహిళా భక్తులు ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.
సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


కంటోన్మెంట్‌లో పార్వతీపరమేశ్వరుల విగ్రహాలతో ఊరేగింపు


ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు

నేడు మత్తిరు వేంకటేశ్వరుని కల్యాణం

డెంకాడ: మండలంలోని గంట్లాం శ్రీశాంతి క్షేత్రంలో వెలసిన మత్తిరు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు గంట్లాం మాజీ సర్పంచ్ మల్లపురాజు కాసులరాజు తెలిపారు. కార్తీక మాస బహుళ పాడ్యమి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. వేదపండితులచే పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. మధాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- జిల్లా సహకార అధికారి రమేష్


సహకార జెండాను ఎగురవేస్తున్న సహకార అధికారి రమేష్

విజయనగరం ఫోర్ట్/విజయనగరం అర్బన్: సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని జిల్లా సహకార అధికారి పి.రమేష్ అన్నారు. జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (డీసీఎంఎస్)లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ముందుగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సహకార జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నవంబర్ 14 నుంచి వారం రోజుల పాటు సహకార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామిక రంగంలో కూడా సహకార సంఘాల ప్రాధాన్యతను పెంచేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఇప్పటకే ఎరువులు తయారీ, పాలు ఉత్పత్తిలో సహకార సంఘాలు గణనీయమైన విజయాన్ని సొంతం చేసుకున్నాయన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈఓ ఉమామహేశ్వరావు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో 95 పీఏసీఎస్‌లు ఉన్నాయని, వాటిన్నింటినీ కంప్యూటరీకరించే పక్రియను శరవేగంగా నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా సహకార సంఘాలపై మరింత నమ్మకం, పారదర్శకత పెరగుతుందని చెప్పారు. ఐసీఎం కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందన్నారు. గ్రామీణ స్థాయిలోనే సహకార సంఘాలను కేవలం ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, ఇతర కార్యక్రమాలకు కూడ విస్తరించాలని నిర్ణయించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి బి.సన్యాసినాయుడు, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.